తెలుగు ప్రేక్షకుల అభిమాన హీరో నటిస్తున్న ఒక చిత్రం తాలూకు ఔట్‌డోర్ షూటింగు జరుగుతోంది

హీరో రవీంద్ర షామియానా నీడలో కూర్చుని హీరో యిన్‌తో కులాసాగా కబుర్లు చెప్తూ కూల్ డ్రింకును 'సిప్' చేస్తున్నాడు.

# డమ్మీ

## పరిమళా సోమేశ్వర్

కొన్ని గజాల దూరంలో బయట మండు టెండలో రవీంద్ర డమ్మీ - రాములు రవీం ద్రకు మారుగా తోటి వస్తాదులతో కుస్తీ పడుతున్నాడు.

హీరో రవీంద్ర ముఖంనిండా చిరు నవ్వులు.

డమ్మీ రాములు శరీరం నిండా చెమటలు.

హీరో గొంతులో కూల్ డ్రింక్ తాలూకు త్రేన్పులు.

రాములు కడుపులో ఆకలి నకనకలు.

ఈ "ఫైటింగ్ సీన్" అయిపోయినాక "యూనిట్" వాళ్ళందరికీ ఫలహారాలు పెడ తారు. రాములు "డిషుం డిషుం" చేస్తున్నాడే గాని అతని మనసంతా ఒక గంట లోగా తినబోయే పదార్థాల మీదనే వుంది.

రెండురోజులనుంచి కడుపునిండా భోజ నమే లేదు రాములికి. తన పర్సనాలిటీ, చిన్నప్పటినుంచి సరదాగా నేర్చుకున్న



జాక్సింగూ - ఈరెంటి పుణ్యమా అని యిన్నాళ్ళకు ఒక ఉద్యోగం అంటూ కుది రింది.

దీని కోసం ఎన్ని నెలలు అవస్థ పడ్డాడు? ఎన్ని అవమానాల నెదుర్కొన్నాడు! ఎంతమంది కాళ్ళు పట్టుకుని "ఛీ" అని పించుకున్నాడు!

చివరికి అతి కష్టంమీద దొరికింది ఈ ఉద్యోగం.

రవీంద్ర సాధారణంగా సాంఘిక చిత్రాల లోనే నటిస్తాడు. స్టంటు చిత్రాలలో నటిం చటం యిదే ప్రథమం.

అతని ప్రత్యర్థి సురేంద్ర ఎప్పుడూ జాన పద, పౌరాణిక చిత్రాలలోనే నటించటం వల 'స్టంటు' హీరోగా అతని పేరు స్థిర పడిపోయింది.

ఈ మధ్య ప్రేక్షకుల అభిరుచులు చిత్రంగా మారిపోతున్నాయ్. "సాంఘిక చిత్రాలలో కూడా అథవా ఒక పౌరాణికం సీనూ, ఒక ఫైటింగు సనూ అన్నా లేందే సినిమాలు చూడం" అంటున్నారు.

అందుకే రిక్షావాలా పాత్ర వేసినా, జమీందారుగారు అబ్బాయి పాత్ర వేసినా జానపద హీరోలాగా పదమంది సాయుధు లైన గూండాలను, నిరాయుధుడైన హీరో పది నిమిషాల ఫైటింగు తరువాత చావ చితక్కొట్టే సీనును ప్రతి సినిమాలోనూ తప్పనిసరిగా అతికిస్తున్నారు నిర్మాతలు. ఈ రోజుల్లో 'రేప్' సీనులాగా ఫైటింగు సీను కూడా తప్పనిసరి అయిపోయింది సినిమాల్లో.

అందుకే ప్రేక్షకుల్లో తన 'ఇమేజ్' దెబ్బతినకుండా ఉండేందుకుగాను, రవీంద్ర కూడా స్టంట్ కం పౌరాణికం కం జానపదం కం సాంఘికం చిత్రాల్లో నటిస్తానని తన

నిర్మాతలందరికీ మాట యిచ్చేడు.

అలాటి చిత్రాల్లో మొదటిదాని షూటింగే యిప్పుడు జరుగుతోంది రవీంద్ర సంటు చిత్రాల్లో నటిస్తానని అనగానే అతనికోసం "డమ్మీ'ని వెతకటం ప్రారంభించేరు నిర్మాతలు. దర్శకులు.

వచ్చిన అభ్యర్థులలో రాములు ఎత్తూ. లావూ రవీంద్ర పర్సనాలిటీకి దగ్గరగా ఉండటంవల్ల వెంటనే అతనిని 'బుక్' చేసుకున్నారు.


అంతకు మునుపు 'రౌడీ' వేషాలేమయినా యిప్పించమని స్టూడియోల చుట్టూ కాళ్ళరిగేలా తిరిగి, ఆశలొదులుకోబోతున్న తరుణంలో రవీంద్ర ఫైటు సీనులలో నటించటానికి ఒప్పుకోవటం, వెంటనే నిర్మాతలు వేషాలిప్పించమంటూ. రోజూ వెంటపడుతున్న రాములిని. అతనిలాటి మరికొందరినీ ఇంటర్వ్యూ చేసి రాములిని హీరో రవీంద్రకు "డమ్మీ'గా ఎన్నుకోవటమూ జరిగింది.

షూటింగు సమయాల్లో కడుపునిండా తిండి దొరకడమేగాక వందా రెండువందలు డబ్బుకూడా వస్తుంది. మళ్ళీ అవకాశం వచ్చేదాకా ఆ డబ్బుతోనే కుటుంబం గడవాలి.

అంతకుముందు రాములు కూలిపని ఏదో ఒకటి చేస్తుండేవాడు. ఈ సినిమాల పిచ్చిపట్టుకున్నాక కూలికి పోవటం మానేశాడు. భార్య మాత్రం యిప్పటికి పాచిపన్లు చేస్తూ పదీ పరకా సంపాదిస్తోంది.

"ఫైటింగ్ సీను" పూర్తయింది. విలన్ పాత్రధారి నిజంగా వస్తాదే అవటం వల్ల డమ్మి లేకుండా అతనే కుస్తీ పట్టేడు. తాను విలన్ననీ, హీరో చేతిలో ఓడిపోవాలనీ అతనికి గుర్తున్నట్టు లేదు. ఛాన్సు దొరికిందే చాలన్నట్టు రాములు వళ్ళంతా హూనంచేసి పెట్టేడు. రాములుకి కుడికాలు బెణికింది ముఖం నేలకు రాసుకుని రక్తం చిమ్మింది.






ఆ బాధకన్నా ఆకలి తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల శరీర బాధ మరచి ఆవురావురుమంటూ తిన్నాడు రాములు. అతని తిండి చూసి కొందరు ఎక్కువ చూపులు చూడసాగేరు. "తేరగా పెడుతున్నారని పడి తినటమేనా?" అన్నట్లున్నయ్ వారి చూపులు. రాములదేమీ గమనించనేలేదు.

ఐతే రాములు ఎవరికైతే 'డమ్మీ'గా పనిచేస్తున్నాడో ఆ హీరో రవీంద్రకు మాత్రం చిత్రం తాలూకు పెద మనుషులు కొసరి కొసరి పెడుతూ తినమని బతిమాలుతున్నారు. చైనీస్ హోటల్లోని భోజనం తప్ప మరే భోజనమూ ముట్టనని రవీంద్ర అనటంవల్ల ఇరవై మైళ్ళ దూరంలో ఉన్న చైనీస్ హోటల్‌కి పంపి భోజనం తెప్పించారు. భోజనం అవగానే ద్రాక్షపళ్లు తినటం తనకలవాటన్నాడు రవీంద్ర.

"ద్రాక్షపళ్ళ సీజనింకా రాలేదుకదా!" అంటూ ప్రొడక్షన్ మానేజర్ తన సందేహాన్ని అమాయకంగా వెల్లడి చేశాడు.

"ఫలానా దుకాణంలో అన్ని పళ్ళూ అన్ని సీజన్లలోనూ దొరుకుతాయి" అని ఎవరో అన్నారు.

వెంటనే ఆ ఫలానా దుకాణం కోసం పది లీటర్ల పెట్రోలు ఖర్చుపెట్టి కారులో వెళ్లి ద్రాక్షపళ్ళు తీసుకువచ్చారు

హీరో చేష్టలన్నీ చూసి రాములులాటి "వర్కర్సు" చెడుగా భావించలేదు. ఆఖరికి రాములు ఆకలితో కడుపు నిండా భోజనం చెయ్యటం చూసి ఈసడించుకున్న వాళ్ళు కూడా రవీంద్ర కోసం జరుగుతున్న ఏర్పాట్లన్నిటినీ భయభక్తులతో గమనించసాగేరు.

"'హీరో లక్షణాలు' అంటే అలాగే ఉండాలి" అని వారి అభిప్రాయంకూడా.

భోజనాలవగానే రాములు వారి వద్ద సెలవు తీసుకుని రెండు మైళ్ళ దూరంలో ఉన్న బస్టాపుకి కాలినడకన వెళ్ళి బస్సెక్కి యిల్లు చేరుకున్నాడు.

హీరో రవీంద్ర భోజనం తరువాత రెండు గంటలసేపు విశ్రాంతి తీసుకుని కాస్త చల్లబడ్డాక కారులో బయల్దేరి వెళ్ళేడు.

ఆ సంఘటన తరువాత రాములి శరీరం మామూలు స్థితికి రావటానికి నాలుగు రోజులు పట్టింది.

తరువాత హీరో రవీంద్ర హీరోయిన్‌తో కలిసి చేసే సీన షూటింగును అవసరాన్ని మించి పొడిగిస్తూ ఉండటంవల్ల రాములి అవసరం రాలేదు.

ఐదు నెలల తరవాత మరో చిత్రంలో రవీంద్రకు "డమ్మీ"గా పనిచేసే అవకాశం వచ్చింది రాములికి. ఈసారి జోరున కురుస్తున్న వర్షంలో బురదలో పడి పొర్లుతూ విలన్‌తోపాటు ఇరవై మంది రౌడీలను చావగొట్టవలసి వచ్చింది. సీనంతా అయిపోయిన తరువాత కొనఊపిరితో ఉన్న విలన్‌ని జీపులో వచ్చిన పోలీసులు అరెస్టు చేస్తారు. అది మామూలే!

ఆ సీనుకి నాలుగైదు సార్లు రిహార్సల్సు కావలసివచ్చింది. అంతసేపూ వర్షంలో బాగా తడిసి, బురదలో పొర్లటంవల్ల ఆ షూటింగయిన తరువాత రాములికి నిమోనియా వచ్చి నెలరోజులు మంచానపడ్డాడు. రవీంద్ర స్టంటు హీరోగా నటించిన రెండు సినిమాలూ యించుమించు ఒకేసారి విడుదలయినయ్.

ఫైటింగు సీనులలో రవీంద్రను తెరపై చూడగానే ప్రేక్షకులు సంతోషాతిశయంతో ఈలలు, చప్పట్లు ప్రారంభించేరు. మామూలు నటనలోనే కాక ఫైటింగులో కూడా అతని కతనే సాటి అని సామాన్య ప్రేక్షకు లందరూ ఏకగ్రీవంగా ఒప్పుకున్నారు.

ముఖ్యంగా రక్తంతో తడిసిన బురదలో జోరున కురుస్తున్న వర్షంలో రవీంద్ర రౌడీలను జయించిన సీనును చూట్టానికి జనం విరగబడి వచ్చేరు. ఒకటికి పదిసార్లు చూసేరు రవీంద్ర అభిమానులు ఆ సినిమాను.

"ఇకనుంచి మీరు అలాటి ఫైటింగు సీనులుగల చిత్రాలలోనే నటించి మమ్మల్ని ఆనందపరచాలి" అంటూ అభిమాన ప్రేక్షకులు రవీంద్రకు ఉత్తరాల పరంపరను పంపించసాగేరు.

రవీంద్ర డాషింగ్ హీరోగా నటించిన చిత్రం విజయవంతం కావటంతో అలాటి చిత్రాలను నిర్మించటానికి అతనికోసం ప్రొడ్యూసర్లు క్యూలో నించోసాగారు.

తను నటించిన (ఫైట్ చేసిన) చిత్రాలలో తనని తాను చూసుకుందామని రాములు ఎంతో ఆశపడ్డాడు. అతనికెవ్వరూ ఇన్విటేషను పంపలేదు. డబ్బుపెట్టి సినిమా చూటానికి పదిరోజులు పట్టింది. తీరా డబ్బు దొరికేక క్యూలో నిల్చున్నా తన దాకా వచ్చే సరికి టికెట్లు అయిపోయినాయంటూ బుకింగ్ క్లోజ్ చేశారు. మర్నాడు సినిమా ప్రారంభమవటానికి రెండు గంటలు ముందుగానే వెళ్ళి ఎలాగో సినిమా చూసేడు.

తెరమీద తనని తానుచూసుకుని మైమరచి పోయేడు రాములు.

మళ్లా రెండో ఆటలో కూడా తనున్న సీన్లు చూద్దామనుకున్నాడు. కాని చేతిలో

# బ్రతుకు పాట

పాడరా నా తండ్రి ఈ బ్రతుకుపాట
వెయ్యరా ఈ జగతి రత్నాల బాట
"పాడలేనే అమ్మ కన్నీటి పాట
విప్పలేనే అమ్మ కష్టాల మూట"
కన్నీటి బిందువులె ఆణిముత్యాలు
కష్టాల మూటలే దారి భత్యాలు
"ఈదలేనె అమ్మ ఈ సముద్రాలు
ఈడ్చలేనే అమ్మ ఈ 'దరిద్రాలు"
ఎదురీదినప్పుడే ఎదుగును బ్రతుకు
మొయ్యలేనన్నాళ్ళు మోజులు లేవు
'గఢాంధ కారాలు అలముకున్నాయి
దారుణరుధిరాలు ఘలుముకున్నాయి"
నీ గుండె మంటలే మారాలు చూపు
ఎర్రన్ని పువ్వుల్లు నీ పదములొత్తు
"త్రోవలో నాకింక తోడెవ్వరమ్మా?"
అలసినపుడు నాకు నీడెవ్వరమ్మా!'
ముందున్న అన్నలు తోడు వుంటారు
నీ తల్లి దీవెనల నీడలుంటాయి.

డరా నా తండి ఈ బ్రతుకు పాట
వెయ్యరా ఈ జగతి రత్నాల బాట.

—సీరపాణి

డబ్బులేదు. పిల్లల్ని, పెళాన్ని తడవగొకరు పొస్తున డబ్బున్నప్పుడల్లా సినిమాకి పంపించేడు.


రవీంద్ర "డాషింగ్ హీరో"గా నటించడం ప్రారంభించిన దగ్గరనుంచి రాముల అవసరంకూడా పెరిగిపోయింది. అందువల్ల రాములిని నెల జీతానికి రవీంద్రే కుదుర్చుకున్నాడు. ఏ సినిమాలో అవసరమైతే అందులో రాములు ఫైట్ చేసాడు. తనకి తప్ప మరెవకీ 'డమ్మీ'గా పని చేయకూడదని రవీంద్ర శాసించేడు.

రవీంద్ర డిమాండు పెరిగిన కొలదీ రాముల జీవితం కూడా మెరుగవుతూ వచ్చింది. ఇంటిలి పాదికీ కడుపునిండా తిండి దొరికే జీతం లభిస్తోంది. కాని పనిలో రిస్కు మాత్రం చాలా ఎక్కువ.

ఒకసారి మంటలలో కాలిపోతున్న ఇంట్లో నుంచి ఒక పిల్లవాడిని రక్షించే సీనులో నిజంగానే వళ్ళు కాల్చుకున్నాడు రాములు.

అతనికి బాగయ్యే వరకు రవీంద్ర నటించే చిత్రాల నిర్మాణాన్ని ఆపుచేయవలసి వచ్చింది. తనని ఉద్యోగంలో నుంచి ఎక్కడ తీసేస్తాడో రవీంద్ర అని చాలా భయపడ్డాడు రాములు.

కాని రవీంద్రకు రాములిమీద అప్పటికే




బాగా గురి ఏర్పడిపోయింది.

సినిమా ప్రపంచంలోని వారికి సెంటిమెంట్లు, చాదస్తాలు ఎక్కువ. ఆ మాటకి వస్తే డబ్బున్న వాళ్ళందరికీ అవి కాస్త ఎక్కువ పాళ్ళలోనే ఉంటాయి.

రాములు "డమ్మీ"గా నటించిన చిత్రాలు తనాశించిన దానికన్న ఎన్నోరెట్లు విజయవంతంగా నడవటంతో రవీంద్రకు రాములు వచ్చిన "వేళ" మంచిదని తోచింది.

రాములు తప్ప మరో "డమ్మీ"ని వాడటానికి వీల్లేదని నిర్మాతలందరికీ ఖచ్చితంగా చెప్పేడు.


రాములు కోలుకున్నాక మళ్ళీ పనిలో చేరాడు. రాములుకి అడపా దడపా కాళ్ళో చేతులో, మెడో ఏదో ఒకటి బెణుకుతూనే ఉంటుంది. కొన్ని సందర్భాలలో బలమైన గాయాలు కూడా తగిలేవి. ఓసారి గుర్రం మీదనుంచి పడ్డాడు మరోసారి ఒక ఆటోతో గుద్దుకుందతనిని. ఒకసారి బండిచక్రం క్రింద కాలుపడి ఎముక ఫ్రాక్చర్ అయింది. ఇలాటి తాత్కాలికమైన అవాంతరాల నెదుర్కొంటున్నా తన కుటుంబ పోషణకు సరిపడ జీతం లభిస్తుండటం వలనూ, తన 'బొమ్మ' వెండితెర కెక్కుతోందన్న తృప్తితోను అతనికా ఉద్యోగం బాగానే ఉంది.

ఒకసారి రాములు కోటి రూపాయల ఖర్చుతో నిర్మించబడుతున్న పేట నటీనటులతో గూడిన భారీ వర్ణ చిత్రంలో 'రవీంద్ర'కు 'డమ్మీ'గా చాలా సీన్లలో నటించవలసి వచ్చింది. ఆ చిత్రం విజయవంతమైతే రవీంద్ర 'స్టార్ జీవితం, ఒక పెద్ద మలుపు తిరిగినట్టే!

అందుకే ఆ చిత్రం మీద ఎన్నో ఆశలు పెట్టుకుని ఉన్నాడు రవీంద్ర. తెలుగులో గాని హిందీలోగాని ఏ భారతీయ చిత్రంలో కూడా హీరో అంతవరకు ఎన్నడూ చెయ్యని సాహస కృత్యాలను రవీంద్ర ఆ పిక్చర్‌లో చేస్తాడు ఆ పిక్చర్ రిలీజయిందంటె నిర్మాతలకు, డిస్ట్రిబ్యూటర్లకు కనకవర్షం కురిసినట్టే! రవీంద్ర 'రేటు' కూడా ఎక్కువవటానికి అవకాశాలున్నాయి.

అందుకే ఆ సినిమా విడుదలైనాక రాములి జీతాన్ని రెట్టింపు చేస్తానని మాట యిచ్చేడు రవీంద్ర.

ఆ వార్త విని. రాములు, అతని కుటుంబం ఎంతగానో పొంగిపోయేరు. ఎప్పటికన్న



ఎక్కువ ఉత్సాహంతో ఆ చిత్రంలో పని చేసేడు రాములు.

అందులో ఆఖరిది— క్లైమాక్సు సీనులో హీరో విలన్లు సముద్రం మధ్యలో హోరా హోరీ పోట్లాడుకోవాలి. హీరో పడవ అంచునుంచి సముద్రంలోకి జారిపోబోతుం డగా ఒక్కసారి శక్తిని పుంజుకుని లేచి బలంకొద్దీ విలన్‌ను ఒక్కతోపు తోస్తాడు. ఆ తోపుకి విలన్ వెళ్ళి సముద్రంలో పడతాడు.

ఆ సీనులో హీరోకి, విలన్‌కి ఇద్దరికీ 'డమ్మీ'లనే పెట్టేరు. ఆ సీనులో నటించటానికి నేర్పుతోపాటు గుండెబలం కూడా ఉండాలి.

రాములు 'సముద్రంలో ఎన్నడూ కాలు పెట్టలేదు. అతనికి సముద్రాన్ని చూస్తుంటేనే అదో రకం భయం. కనీసం ఈ సీన్లో నటించైనా సముద్రమంటే తనకున్న భయాన్ని పోగొట్టుకోవాలనుకున్నాడు. అదీకాక ఈ సినిమా విడుదలయిన దగ్గరనుంచి తన జీతం రెట్టింపవుతుంది.

అందుకే ఎంతో ఉత్సాహంగా ఆ రోజు పని మీదకు వెళ్ళేడు. పైగా ప్రత్యేకించి ఆ సీనులో నటించినందుకు "డమ్మీ"లకు స్పెషల్ ఫీజు ముడుతుందని నిర్మాత చెప్పేడు కూడా.

క్లైమాక్సు సీను ప్రారంభమయింది.

"యూనిట్" వాళ్ళంతా సముద్రపు ఒడ్డున కూర్చుని వినోదంగా ఫైటింగు సీనును పరికిస్తున్నారు. వారిలో రవీంద్ర కూడా ఒకడు.

ఆ సీనులో తను ప్రేక్షకులకు ఎలా కనబడతాడో రాములుని చూసి ఊహించుకుంటూ తన భవిష్యత్తును గురించి బంగారు కలలు కంటున్నాడు రవీంద్ర.

చిత్రం విడుదలయేక యింత భారీఎత్తున తీసిన తన స్వంతు చిత్రం పదేళ్ళ తరువాత కూడా ప్రేక్షకుల హృదయాల్లో నిలుస్తుందని మురిసిపోతూ చూస్తున్నాడు నిర్మాత. ఈ సీను కూడా సక్సెస్‌ఫుల్‌గా పూర్తయితే డబ్బులింక లాటరీలసిండా పరుగెత్తుకుంటూ వస్తాయని తియ్యగా ఆలోచిస్తున్నాడు డిస్ట్రిబ్యూటర్.

"డమ్మీ"లిద్దరూ ఎంతో ఉత్సాహంతో ఫైట్ చేస్తున్నారు. వారి చురుకుదనాన్ని కెమెరామెన్ అందుకోలేక ఆరాటపడుతున్నాడు. డైరెక్టరు వాళ్ళను హుషారు చేస్తూ కేకలు వేస్తున్నాడు.

అందరూ ఎంతో ఉత్సుకతతో, ఉద్వేగంతో ఊగిపోతున్న తరుణంలో రాములు హఠాత్తుగా కాలుజారి బోటునుంచి నీళ్ళలోకి పడ్డాడు. ఆ సంగతి ఎవ్వరూ గమనించలేదు మొదట.

క్లైమాక్సుల సీనులోని ఆఖరి భాగంలో అతను నీళ్ళలోకి పడబోయినట్లు నటించి ఒక్కసారిగా పైకి లేస్తాడు రాములు.

అందుకే అందరూ అతను లేచి బోటు మీదకు వస్తాడని ఎదురు చూసేరు.

వాళ్ళు తేరుకుని ప్రమాదాన్ని గ్రహించే లోపుగానే పరిస్థితి చెయ్యిదాటిపోయింది.

ఉవ్వెత్తున లేచి పడుతున్న కెరటాలు క్రూరంగా రాములిని అవతలి వైపుకు విసిరివేసినయ్.

హోరుమనే అలల మోత. ఎగజిమ్ముతున్న తెల్లని నురుగు... బుస్సుమని లేచిన త్రాచుపాములా కనపడుతున్నయ్.

అనంతకోటి అలలమధ్య రాములి శరీరం ఎక్కడుందో ఎవరికీ అంతుపట్టలేదు. అరగంట సేపు గడిచేకాని రాములింక తిరిగి రాడన్న నిజాన్ని వారి మనసులు తట్టుకుని గుర్తించలేక పోయినయ్.

అందరి గుండెలూ బరువెక్కినయ్.

హీరో రవీంద్ర కళ్ళనుంచి నిజమైన కన్నీళ్ళు రాలినయ్.

తనకోసం, తన కీర్తికోసం, ఆహుతైన ఆ అమాయకుడి రూపం గుర్తుకు వచ్చిన కొలదీ అతనికి గుండెలో ముల్లు గుచ్చుకున్నట్టుగా ఉంది.

సముద్రం సీనులో ఫైటింగు చేసి ఎక్స్ట్రా డబ్బు పట్టుకు వస్తానని భార్యతో చెప్పాడు రాములు ఆ రోజు బయల్దేరేముందు. చివరికి కనీసం శవం కూడా తిరిగి ఇంటికి రాలేదు.

ఆ రోజుకు షూటింగును ఆపివేశారు. రాములి కుటుంబానికి వెయ్యి రూపాయలు పంపేడు రవీంద్ర "కాల్చటానికి శవమన్నా లేదయ్యో. ఈ డబ్బుని నేనేం చేసుకోను!" అంటూ ఏడ్చింది రాములి భార్య.

వారం రోజుల తర్వాత రాములిస్థానంలో మరో డమ్మీని పెట్టుకుని ఆ చిత్రం షూటింగ్ పూర్తి చేసేడు రవీంద్ర. అందరూ ఆశించినట్లుగానే ఆ చిత్రం బాగా 'హిట్' అయింది.

రవీంద్ర మరింత బలం పుంజుకుని తారాపథంలో ధ్రువతారలా వెలిగిపోతున్నాడు.

పాపం! సముద్రగర్భంలో కలిసిపోయిన డమ్మీ రాములు. ......

★

